

జగదాంబ జంక్షన్ తెన్నేటి పార్కు నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఇలా..

మండే బిజీబిజీ..

కేజీహెచ్‌కు రోగులు, కలెక్టరేట్‌కు ఫిర్యాదుదారులతో రద్దీ

కిటకిటలాడిన జగదాంబ జంక్షన్ – కలెక్టరేట్ – జిల్లా పరిషత్ రోడ్డు

దాబాగార్డెన్స్: వారంలో మొదటి రోజు సోమవారం కేజీహెచ్‌కు వచ్చే రోగులు... కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారులతో నగరంలో కీలకమైన జగదాంబ జంక్షన్ – కలెక్టరేట్ – జిల్లా పరిషత్ రోడ్డు కిటకిటలాడింది. ఇప్పటికే నగరంలో పెరుగుతున్న వాహనాలతో పాదచారులు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సోమవారం కావడంతో మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సమస్య తప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు తమ గమ్యాలకు చేరుకునే వేళ, తిరిగి ఇంటికి చేరుకునే సమయాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.

ఇరుకు రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో...

ముఖ్యంగా కలెక్టరేట్ కూడలి నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే మార్గం నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ మార్గానికి ఇరువైపులా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినికల్ లేబొరేటరీలు అధికంగా ఉన్నాయి. ఆయా ఆస్పత్రులు, ల్యాబ్‌లకు రోగులను చికిత్స, పరీక్షల కోసం వాహనాలతో తీసుకొస్తుంటారు. రోడ్డు చిన్నది కావడం, ఇరువైపులా వాహనాలు ఇష్టారాజ్యంగా నిలిపేయడంతో ఈ మార్గంలో వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో నడిచేందుకు కూడా మార్గం లేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాహనాల రద్దీ వల్ల రోజూ చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం కావడంతో ఈ ప్రాంతమంతా మరింత రద్దీగా మారి వాహనాల రణగొణ ధ్వనులతో భయంకరంగా మారుతోంది. జిల్లా పరిషత్ కూడలి నుంచి అంకోశా మీదుగా పందిమెట్ట వెళ్లే మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. అలా చేస్తే రోగులను ఆయా లేబొరేటరీలు, ఆస్పత్రుల వద్ద దించేసి వాహనాలను పందిమెట్టకు వెళ్లే మార్గంలో పార్కింగ్ చేసుకునే వీలుంటుందని భావిస్తున్నారు.

జగదాంబ జంక్షన్‌లో ఆటోవాలాల హవా

జగదాంబ కూడలి నుంచి ఓ – ఆప్టెక్స్ మీదుగా ఉదయం నుంచి రాత్రి వరకు ఆటోవాలాలదే హవా. రోడ్డు మలుపులో ప్రయాణికులను దించేందుకు, ఎక్కించుకునేందుకు ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలిపేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జగదాంబ, కలెక్టరేట్ మధ్య ఉన్న అర కిలోమీటర్ దూరం చేరుకోవడానికి కనీసం 30 నిమిషాల సమయం పడుతోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జగదాంబ నుంచి ఓ – ఆప్టెక్స్ రోడ్డు మలుపులో ఆటోలు నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు గట్టి చర్యలు చేపడితే ఈ సమస్య పరిష్కారమవుతుందని, ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు.

జిల్లా పరిషత్ జంక్షన్‌లో బారులు తీరిన వాహనాలు





కేజీహెచ్ ఔట్ గేట్ ఎదుట పద్మవ్యూహం

ఉత్తరాంధ్రుల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ ఔట్‌గేట్ ఎదుట నిరంతరం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఒక్కో సమయంలో అంబులెన్స్‌లు కూడా కదలలేని పరిస్థితి ఎదురవుతోంది. ఆటోలు, కార్లు, బస్సులు ఈ ప్రాంతంలో కొంత సమయం ఆగాల్సిందే. ఇక్కడ ప్రైవేట్ ఆస్పత్రులు, మందుల షాపులు అధికంగా ఉండడం, ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ ఎప్పుడోకాని ఇక్కడ కనిపించదు. దీంతో ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలిపేస్తుంటారు. వాహనాల రాకపోకలకు అంతరాయంతోపాటు నిరంతరం చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు నిత్యం పర్యవేక్షిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం..!



- శిథిలమవుతున్న బల్లిగిరి వెంకన్న ఆలయ ముఖ ద్వారం
- దాతలదే బాధ్యత అంటున్న ఆలయ వర్గాలు
- అధికారుల తీరుపై దాతల ఆవేదన

అల్లిపురం: ఆలయ ప్రతిష్టకు నిదర్శనం ముఖద్వారం. ఆ ద్వారమే నిర్లక్ష్యానికి గురవుతోందని బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులు, దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతల సహకారంతో గోకుల్‌రోడ్డులో నిర్మించిన ఆలయ ముఖద్వారం నిర్లక్ష్యానికి గురవుతోంది. ముఖద్వారానికి రంగులు వేయకపోవటం సరికదా, పట్టిన దుమ్మును కూడా కడగక పోవటంతో చూసే వారికి ఎబ్బెట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖద్వారం పైన అక్షరాలు రాలిపోయి, బోర్డు విరిగిపోయినా పట్టించుకోనే వారు లేరు. దీంతో దేవదాయ శాఖ తీరుపట్ల భక్తులు, దాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ముఖద్వారాన్ని దాతలు నిర్మించి డాక్యుమెంట్ ద్వారా దేవదాయ శాఖకు అప్పగించారు. అప్పటి నుంచి ఏటా కాకపోయిన ధనుర్మాసం వేడుకల సమయాల్లో ఆలయ ముఖద్వారాన్ని కడగటం, ఆలయంతోపాటు ముఖద్వారానికి రంగులు వేసే వారు. ఈ ఏడాది రంగులు వేయకపోగా కనీసం ముఖద్వారాన్ని కడగనైనా లేదని భక్తులు వాపోతున్నారు. ముఖద్వారం పైన ఏర్పాటు చేసిన బోర్డు శిథిలమై అక్షరాలన్నీ రాలిపోయినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్షరాలు రాలిపోవటం వల్ల మిగిలిన స్ట్రక్చర్ ఎప్పుడు కింద పడుతుంతో, ఎవరికి గాయలు అవుతాయోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

> **దేవాలయానికి అప్పగించాం**
> మా సొంత నిధులతో ఆలయ ముఖ ద్వారాన్ని నిర్మించి ఇచ్చాము. ముఖద్వారాన్ని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కి డాక్యుమెంట్ ద్వారా అప్పగించాం. ముఖద్వారం నిర్వహణ దేవాలయ అధికారులు చూసుకోవాలి. కానీ వారు పట్టించుకోవడం లేదు.
> – పీల వెంకట అప్పలనాయుడు, ముఖద్వారం దాత

> **నిర్వహణ బాధ్యత దాతలదే**
> దాతల సహకారంతో నిర్మించిన ఆలయ ముఖద్వారం నిర్వహణ బాధ్యత దాతలదే. దాని బాగోగులు వారే చూసుకోవాలి. దేవాలయం ఆదాయం ఆలయ నిర్వహణ వరకే సరిపోతుంది. ముఖద్వారానికి ప్రతి రెండేళ్లకు ఒకసారి దాతల సహకారంతో రంగులు వేస్తుంటాం.
> – జీవీ రమాబాయి, ఆలయ కార్యనిర్వహణాధికారి

> **దేవస్థానమే నిర్వహించాలి**
> దేవాలయానికి అప్పగించిన తర్వాత ద్వారం నిర్వహణ బాధ్యత దేవస్థానానికి ఉంది. దాతలు సహాయం చేస్తారు. బహుమతులు ఇస్తారు. అంతే కానీ వారిచ్చిన వాటిని వారే నిర్వహించాలనడం సరికాదు. దేవాలయ అభివృద్ధికి దాతలు సహకారం ఉండాలంటే వారిచ్చిన వస్తువులకు గౌరవం దక్కాలి.
> –బొడ్డు పోలారావు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు

మొల్లమాంబ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వండి

మహారాణిపేట: రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన కవయిత్రి అతుకూరి మొల్లమాంబ జ్ఞాపకార్థం ఆర్.కె.బీచ్‌లో విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని విశాఖ శాలివాహన వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దేవరపు చిరంజీవిరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ మయూర్ అశోక్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. 2017లో అతుకూరి మొల్లమాంబ పేరిట ఒక తపాలా బిల్ల కూడా భారత ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఏటా మార్చి 13న కవయిత్రి మొల్లమాంబ జన్మదినాన్ని రాష్ట్ర పండగగా జరపాలని జీవో నంబరు 99 విడుదల చేసిందన్నారు. ఇప్పుడు ఆర్కే బీచ్‌లో విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని చిరంజీవి కోరారు. అసోసియేషన్ నాయకులు కె.చిరంజీవిరావు, బాబి, వి.రవీంద్రబాబు, వై.వి.రమణయ్య, అరటికోట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ అధికారులపై జేసీకి ఫిర్యాదు

మహారాణిపేట: తప్పుడు డాక్యుమెంట్లతో ఆస్తులు కాజేస్తున్న వారికి జీవీఎంసీ అధికారులు వంతపాడుతున్నారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని జేసీ మయూర్ అశోక్‌ను అత్తిలి సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దిబ్బలపాలేనికి చెందిన అత్తిలి సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. తన తాతగారైన విశ్రాంత జడ్జి అత్తిలి వెంకటరావు నిర్మించిన (1936 రిజిస్టర్ డాక్యుమెంట్స్ ప్రకారం) ఇంటిలో మేము నివసిస్తున్నామని... తమ ఇంటి పేరున ఉండే కొంత మందికి ఎలాంటి పత్రాలు లేకుండా ఇంటి పన్నును మార్పు చేయడానికి జీవీఎంసీ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సంబంధిత పత్రాలు సబ్మిట్ చేయకుండా తప్పుడు హౌస్ ట్యాక్స్ అసెస్మెంట్ నంబర్‌తో మొత్తం ఇంటిని కబ్జా చేయాలని చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు వంత పాడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని గతంలో ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే స్పందించి కమిషనర్‌కు విచారణకి ఆదేశించారని గుర్తు చేశారు. అప్పట్లో ఒక ప్రత్యేక అధికారిని విచారణకు నియమించగా ఇప్పటి వరకు నివేదిక ఇవ్వకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా 'నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే'

సీతంపేట: విశాఖ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకరమఠం రోడ్‌లో గల కార్యాలయం వద్ద 'నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే' సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.మాదన్న, కార్యదర్శి ఆర్.రాము, సభ్యులు, ఎలక్ట్రీషియన్స్ పాల్గొన్నారు.

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింగరావు

దాబాగార్డెన్స్: సిటూ అఖిల భారత మాజీ అధ్యక్షుడు బాలానందన్ శత జయంతి సభ సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింగరావు మాట్లాడుతూ బాలనాందన్ జీవితాన్ని కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అంకితం చేశారని కొనియాడారు. సాధారణ అసంఘటిత రంగ కార్మికుల కుటుంబంలో జన్మించిన బాలనందన్ జీవితాన్ని ఒక సాధారణ కార్మికుడిగా ప్రారంభించి సిటూ అఖిల భారత అధ్యక్షుడిగా ఎదిగారన్నారు. ముఖ్యంగా విద్యుత్, బీఎస్ఎన్ఎల్ కార్మికులను ఐక్యం చేసి సంఘాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సిటూ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత అధ్యక్షుడిగా పని చేసి కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నడిపారన్నారు. ప్రైవేటీకరణ విధానాలు శరవేగంగా అమలు జరుగుతున్న తరుణంలో ఆయన స్ఫూర్తితో కార్మిక వర్గాన్ని అంతటినీ ఐక్యం చేసి, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బాలానందన్ కేరళ అసెంబ్లీ సభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పలుమార్లు ఎన్నికయ్యారన్నారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసి లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఫిబ్రవరి 5న లేబర్ కోడ్స్ రద్దుకు నిర్వహించే ప్రదర్శనలో కార్మికులను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటూ నాయకులు జ్యోతీశ్వరరావు, జగన్, మణి, అప్పలరాజు, సుబ్బారావు, కుమార మంగళం, వై.రాజు, నూకరాజు, వెంకట్రావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం త్యాగాలకు సిద్ధం



దీక్షలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, తదితరులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎన్ని రోజులైనా పోరాడేందుకు, ఎలాంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పార్కులో స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే రోజున ప్రధాని మోదీ స్ట్రాటజిక్ సెల్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు ప్రకటించారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని అవాంతరాలు వచ్చినా, కోవిడ్ సమయంలో కూడా దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ కార్మికులు పోరాడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం కార్మిక వర్గ పోరాట ఫలితమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ పరిష్కారం కాదని... తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, బి.భారతి, కె.మణి, బి.సత్యవతి, సుజాత, వి.కృష్ణారావు, ప్రొఫెసర్ సురప్పడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నెల్లూరుకు బస్సు జాతా



జాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం నుంచి నెల్లూరుకు బస్సు జాతా మంగళవారం చేపట్టనున్నట్లు సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సోమవారం జగదాంబ జంక్షన్ సమీపంలో గల సీపీఎం కార్యాలయంలో బస్సు జాతా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని తీవ్రతరం చేయడంలో భాగంగా, బస్సు జాతా నిర్వహిస్తున్నామని, మంగళవారం ఉదయం 10 గంటలకు స్టీల్‌ప్లాంట్ ప్రవేశ కూర్మన్నపాలెం వద్ద సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

10 నుంచి నీలమాంబేశ్వరి పరస



అల్లిపురం: అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం, యాతపేటలో వెలసిన శ్రీ నీలమాంబేశ్వరి అమ్మవారి పరస మహోత్సవాలు ఫిబ్రవరి 10 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు ఆర్.చంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

23న 'ఇండియన్ మ్యాజిక్' అవార్డ్స్ నైట్

సీతమ్మధార: ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 23న కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ నిర్వహించనున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు డాక్టర్ బీఎస్ రెడ్డి సారథ్యంలో నిర్వహించే ఐఎంఏ అవార్డ్స్ నైట్ గోడపత్రికను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. తమ సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన దేశ, విదేశీ మహేంద్రజాలికులకు అవార్డులు అందజేస్తామని బీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య పురస్కారం, మరో 10 మందికి అవార్డులు అందజేస్తామని తెలిపారు.

ప్రజల సహకారంతో కాలుష్య నియంత్రణ

నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వ్యవస్థను, సైకిళ్లను ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, అందుకు అందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విజయవంతం



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి

దాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్ వేదికగా ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 900 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి రోజు కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు పాల్గొన్నారని తెలిపారు. ఏబీవీపీ ప్రతిష్టాత్మకంగా ఇస్తున్నటువంటి శ్రీజనమంచి గౌరీ శంకర్ యువ పురస్కారం సయ్యద్ షహనాజ్‌కు ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా అందజేశామన్నారు. ఏబీవీపీ మాత్రమే దేశభక్తిని, దైవభక్తిని విద్యార్థుల్లో నింపి దేశానికి సమర్థవంతమైన నాయకులను అందిస్తుందని శ్రీకాంత్ తెలిపారన్నారు. సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్, విశాఖ జిల్లా కన్వీనర్ నితిన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిచంద్రిక, ప్రీతి పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న టీఎస్ మనోహరన్

దాబాగార్డెన్స్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సదరన్ రీజియన్ ఆఫ్ ఫోర్‌మేషన్స్ మనోహరన్ పేర్కొన్నారు. పాతనగరంలోని సెయింట్ అలోసిస్ స్కూల్ ఆవరణలో లాడ్జి యూనివర్సిటీ 142 విశాఖ శాఖ ఆధ్వర్యంలో 'హ్యాపీ న్యూ ఇయర్ – హెల్తీ న్యూ ఇయర్' పేరిట ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలతోపాటు స్థానికులకు మెడికవర్, అపోలో ఆస్పత్రుల సౌజన్యంతో ఉచితంగా కేన్సర్, పాప్‌స్మెర్, చిన్నారుల వ్యాధులపై అవగాహనతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రాండ్ లాడ్జి ఆఫ్ ఇండియా డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ చిత్ర, డాక్టర్ ఎస్‌వీ భాస్కరరావు, అసిస్టెంట్ రీజినల్ గ్రాండ్ మాస్టర్ డాక్టర్ గోపీచంద్, స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాష్, గైనకాలజిస్ట్ రోజ్ మేరీ, పిల్లల వైద్యులు రాజశేఖర్, డాక్టర్ పి.వెంకటకృష్ణారెడ్డి, న్యూట్రిషనిస్ట్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారికి ఈ కోర్సులో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. 15 నుంచి 30 సంవత్సరాలలోపు వయసు గల యువత అర్హులని, ఇతర వివరాలకు 9866883199లో సంప్రదించాలని కోరారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీవోఏల దీక్షలు



జీవీఎంసీ పార్కులో రిలే దీక్ష చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం

సీతమ్మధార : కూటమి అధికారంలోకి వచ్చాక వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులు రిలే దీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వీవోఏలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు ముఖ్యమైన నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కుంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద తదితరులు దీక్షలకు నాయకత్వం వహించారు.